
ప్రజాశక్తి
గురువారం 11 జనవరి 2024 5
పార్వతీపురం మన్యం



టిడిపిలో చేరిన తేజోవతి

ప్రజాశక్తి-సాలూరు

సాలూరు నియోజకవర్గంలో టిడిపి టికెట్ ఆశిస్తున్న గిరిజన మహిళా నాయకురాలు ఎం.తేజోవతి బుధవారం టిడిపి అధినేత చంద్రబాబునాయుడు సమక్షంలో పార్టీలో చేరారు. బొబ్బిలి బహిరంగ సభకు హాజరైన చంద్రబాబు తేజోవతికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్ దేవ్ మద్దతుతో, బొబ్బిలి రాజుల ఆశీస్సులతో ఎస్‌టి నియోజకవర్గ సీటును ఆమె ఆశిస్తున్నారు.


చంద్రబాబునాయుడుతో తేజోవతి

జగన్‌రెడ్డి పాలనలో ధరాఘాతం

- ఐదేళ్లలో ఉత్తరాంధ్రకు ఏం ఒరగబెట్టారు? • బూతులు తిట్టిన వారికే వైసిపిలో సీట్లు
- అధికారంలోకి వస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక, భూరక్షణ చట్టం రద్దు
- పార్లమెంట్ స్థానం పరిధిలో 7 సీట్లూ గెలవాలి • విశాఖను గంజాయి రాజధానిగా మార్చారు
- రా..కదలిరా బహిరంగ సభలో టిడిపి అధినేత చంద్రబాబునాయుడు


బహిరంగ సభకు హాజరైన జనాలనుద్దేశించి మాట్లాడుతున్న టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి -బొబ్బిలి, విజయనగరం కోట

జగన్ రెడ్డి పాలనలో పెరిగిన నిత్యవసర ధరలతో పేదలు సంతోషంగా సంక్రాంతి పండగ జరుపుకునే పరిస్థితి కూడా లేదని మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ధ్వజమెత్తారు. బొబ్బిలిలో బుధవారం నిర్వహించిన రా..కదలిరా బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగించారు. 'నేడు జనసునామీతో బొబ్బిలి కోట బొబ్బిలి పులిలా గర్జిస్తోందని, ఈ గర్జనకు తాడేపల్లి ప్యాలెస్ పిల్లి వణికిపోతోందని అన్నారు. రోడ్లు కూడా సరిగా లేని సమయంలో ఆర్థిక సంస్కరణలు అందిపుచ్చుకుని రాష్ట్రాన్ని అభివృద్ధిచేశామని అన్నారు. ఐదేళ్లలో జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని నాశనం చేశారు. వైసిపి పాలనలో అడుగడుగునా అన్యాయాలు, దౌర్జన్యాలే జరిగాయని, రాతియుగం వైపుగా నడిపిస్తున్నారని, రాతి యుగం కావాలో.. స్వర్ణయుగం వైపు నడుస్తారో ప్రజలే నిర్ణయించుకోవాలని అన్నారు.

భూరక్షణ చట్టం కాదు... భక్షణ చట్టం

'మన పట్టాదారు పాసు పుస్తకాలపై జగన్ బొమ్మేంటి? ఆయనేమైనా మీతాత తరపు బంధువా? లేక మీ అమ్మమ్మ తరపు బంధువా? నిద్ర లేస్తుండగానే ఆయన బొమ్మ చూడడానికి ఆయనేమైనా వెంకటేశ్వరస్వామా? సర్వే రాళ్లపై బొమ్మలు ఏంటి? జగన్ తీసుకొచ్చింది భూ రక్షణ చట్టం కాదు..భక్షణ చట్టం. అది వస్తే మీ భూములు మీ పేర్ల మీద ఉండవు. రికార్డులు తారుమారు చేసి మీ భూముల్ని కొట్టేసే ప్రయత్నం చేస్తున్నారు'. అంటూ చంద్రబాబు ఘాటైన విమర్శ చేశారు. ఎట్టి పరిస్తితుల్లో దీన్ని టిడిపి ఆమోదించబోదని. అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిల్ చట్టం రద్దు చేస్తామని ప్రకటించారు.

విజయనగరంలో గిరిజన యూనివర్సిటీ తెచ్చామని, కానీ దాన్ని నేటికీ పూర్తి చేయలేదన్నారు. బోగాపురం ఎయిర్ పోర్ట్‌ను పూర్తి చేయలేదన్నారు. భావనపాడు పోర్టును నేను ప్రారంభిస్తే పేరు మార్చి మళ్లీ శంకుస్థాపన చేసి, భూములు అమ్ముకునే పరిస్థితికి వచ్చారని అన్నారు. ఓటమి భయంతో జగన్ రెడ్డి ఎమ్మెల్యేలను మార్చుతున్నారని. అందితే జుట్టు, అందకపోతే కాళ్లు పట్టుకునే రకం జగన్ రెడ్డి అని విమర్శించారు. కొంతమంది మంత్రులకు కూడా సీటివ్వలేదని చంద్రబాబు విమర్శించారు. రాజాం ఎమ్మెల్యేని పాయకరావుపేటకు మార్చినప్పటికీ అగ్రవర్ణాల వారిని మాత్రం మార్చకుండా జగన్ బతిమాలాడుకుంటున్నాడని అన్నారు. 80 చోట్ల చోట్ల ఎమ్మెల్యేలను ట్రాన్స్‌ఫర్ చేస్తుండడాన్ని బట్టి వచ్చే ఎన్నికల్లో వైసిపి ఓడిపోతుందని అర్థం చేసుకోవచ్చున్నారు. విజయనగరం పార్లమెంట్ పరిధిలోని ఏడుగురు వైసిపి ఎమ్మెల్యేలు అందినకాడికి దోచుకుంటున్నారని విమర్శించారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే వేధింపులు తట్టుకోలేక సాక్షి విలేకరి ఆత్మహత్య చేసుకున్నాడని, ఎమ్మెల్యేపై జగన్ రెడ్డి ఎందుకు కేసు పెట్టలేదని? ప్రశ్నించారు. సభలో పొలిట్ బ్యూరో సభ్యులు కమిడి కళావెంకటరావు, గుమ్మడి సంధ్యారాణి, మాజీ మంత్రి ఆర్‌కె ఎస్‌వి రంగారావు, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాలవలస యశస్విని, జిల్లా అధ్యక్షులు లోకం మాధవి, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయ కర్తలు, పార్టీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రలో పెత్తందార్ల పెత్తనమేంటి?

ఉత్తరాంధ్ర టిడిపికి కంచుకోట వంటిదని చంద్రబాబు అన్నారు. వెనుకబడిన వర్గాలు అధికంగా ఉండే ఉత్తరాంధ్రలో మళ్లీ బిసిల రాజ్యం వస్తుందన్నారు. ఉత్తరాంధ్రకి విజయసాయిరెడ్డిని, వైవి సుబ్బారెడ్డిని జగన్ సామంతరాజులుగా నియమించారని విమర్శించారు. బిసిలు అధికంగా ఉన్న ప్రాంతంలో ఈ పెత్తందార్ల పెత్తనం ఎందుకన్నారు. ఉత్తరాంధ్రకు నీళ్లు, పరిశ్రమలు తెచ్చి మౌళిక సదుపాయాలు కల్పించి యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. విశాఖ కేంద్రంగా ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామన్నారు. టిడిపి హయాంలో రూ.1,600 కోట్లు ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టుల కోసం ఖర్చు చేశామన్నారు. నేడు జగన్ ఒక్క రూపాయైనా ఖర్చు చేశాడా? అని ప్రశ్నించారు. అందువల్లే మడ్డువలస, తారకరామ, తోటపల్లి, వంశధార వంటి ప్రాజెక్టులన్నీ అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. విశాఖను ఆర్థిక రాజధానిగా, ఐటీ రాజధానిగా, టూరిజం క్యాపిటల్ గా తయారు చేయాలని నేను సంకల్పిస్తే జగన్ రెడ్డి దాన్ని గంజాయి, క్రైమ్ క్యాపిటల్ మార్చారని విమర్శించారు.

ఉపాధ్యాయుల వినతి

ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై హామీ ఇవ్వాలని చంద్రబాబును ఎపిటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.జోగినాయుడు, జిల్లా నాయకులు జెసి రాజు కోరారు. పలు సమస్యలను చంద్రబాబుకు వివరించి అధికారంలోకి వస్తే పరిష్కరిస్తామని హామీ ఇవ్వాలని కోరారు.



అభివాదం చేస్తున్న బేబినాయన

పలు సమస్యల పరిష్కారానికి బాబు హామీ

టిడిపి -జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విజయనగరం కార్పోరేషన్ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. టిడిపి హయాంలో నిర్మించిన 4 వేల టిడ్కో ఇళ్లను లబ్దిదారులకు అప్పగిస్తామన్నారు. పార్వతీపురం జిల్లాలోని ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీని ఏవిధంగా పునరుద్ధరించాలో ఆలోచిస్తామని, బొబ్బిలిలో రైతు బజారు ఏర్పాటు చేస్తామని. బాడంగి మండలంలో వేగావతి నదిపై బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. సముద్ర తీరంలో మత్స్యకారులకు జెట్టీలు ఏర్పాటు, రాజాం - పాలకొండ ప్రధాని రహదారి నిర్మాణం చేపడతామన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే ప్రతి ఊరికీ రోడ్లు వేస్తామన్నారు. బొబ్బిలి నియోజకవర్గం ఇన్ ఛార్జీ బేబీ నాయన స్థానిక సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా వాటి పరిష్కారానికి చంద్రబాబు హామీ ఇచ్చారు.

వైసిపికి గుడ్‌బై చెప్పిన సర్పంచ్, ఎంపిటిసిలు

చంద్రబాబు పర్యటనతో అధికార వైసిపికి భారీ షాక్ తగిలింది. బాడంగి మండలం కోడూరు ఎంపిటిసి మరిపి శ్రీదేవి, ఆమె భర్త రమేష్ వైసిపిని వీడి కొప్పలవెలమ పార్లమెంటరీ కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు ఆధ్వర్యాన టిడిపిలో చేరారు. రామభద్రపురం మండలం కోట శిర్లాం సర్పంచ్ తాడ్డి తిరుపతమ్మ, ఆమె భర్త శ్రీను, మరో 500 కుటుంబాలు, మాజీకౌన్సిలర్లు రెడ్డి ప్రసాద్, ఎ.అప్పారావు టిడిపిలో చేరారు. గొల్లపల్లి 12వ వార్డుకు చెందిన పిరిడి ఈశ్వరరావు, పిరిడి పద్మావతి, మరో 200 కుటుంబాలవారు, వేదాంత డవలపర్స్ అధినేత కోట సురేష్ చేరారు. వీరందరికి చంద్రబాబు కండువాలు వేసి ఆహ్వానించారు. బొబ్బిలి నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగురవేస్తామని నియోజకవర్గ ఇంఛార్జి బేబినాయన అన్నారు.


కత్తి, డాలుతో చంద్రబాబునాయుడు


చంద్రబాబుకు సమస్యలను వివరిస్తున్న అంగన్వాడీలు

చంద్రబాబుకు అంగన్వాడీల వినతి

రాష్ట్రంలో అంగన్వాడీలు చేపట్టిన పోరాటానికి అండగా ఉండాలని చంద్రబాబునాయుడును అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు కామేశ్వరి, రోజా, నిర్మల కోరారు. సభలో చంద్రబాబును కలిసి మద్దతు కోరారు. అంగన్వాడీలకు తెలంగాణ కంటే అదనంగా వేతనాలు ఇస్తామని జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చినప్పటికీ అమలు చేయడం లేదన్నారు. నాలుగు వారాలుగా సమ్మె చేస్తే పట్టించుకోవడం లేదన్నారు. అధికారంలోకి వస్తే అంగన్వాడీలను రెగ్యులర్ చేసి కనీస వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. చంద్రబాబు సానుకూలంగా స్పందించారు.

ఆకలి కేకలు పట్టవా?

- వినూత్నరీతిలో మున్సిపల్ కార్మికుల నిరసన
- 16వ రోజుకు చేరిన సమ్మె

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పక్షం రోజులకు పైగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై మున్సిపల్ కార్మికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ ఆకలి బాధలు సర్కారు చెవికెక్కడం లేదని మండిపడ్డారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం 16వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా పార్వతీపురంలో మున్సిపల్ కార్మికులు వేపకొమ్మలు కట్టుకుని సమ్మె శిబిరం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వ మొండి వైఖరి వీడి, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మామిడి శివ, బంగారు రాజేషు, గుంట్రెడ్డి గంగయ్యలు, తాడ్డి వినయ్, వి.అప్పలనాయుడు, మేడిశెట్టి కృష్ణ, అరసాడ తాతబాబు, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : మున్సిపల్ కార్మికుల సమ్మె 16 రోజుకు చేరింది. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన కార్మికులు మున్సిపల్ కార్యాలయం ముందు 16 అంకె రూపంలో కూర్చుని ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు టి.శంకరరావు, టి.రాముడు, పోలరాజు టి.రవి, ఇందు, స్వప్న పాల్గొన్నారు.


పార్వతీపురంటౌన్.. ఆకులు కట్టుకుని నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

డిమాండ్ల సాధనకు ఎనలేని పోరాటం

సమగ్రశిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

సమాన పనికి సమాన వేతనం కోసం చేపట్టిన సమ్మెను అణచివేయాలని ప్రభుత్వం చూస్తోందని, డిమాండ్లు సాధించుకునే వరకూ ఎనలేని పోరాటం చేస్తామని సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి స్పష్టంచేసింది. సమగ్రశిక్ష ఉద్యోగులు చేపట్టిన బుధవారం 22వ రోజుకు చేరింది. అందులో భాగంగా పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు బివి రమణ, ఎం.ఈశ్వరరావు, కాంతారావు మాట్లాడారు. ఎన్నడూ లేని విధంగా విద్యాశాఖ పరిధిలోని 18 విభాగాల ఉద్యోగులు 22 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. మరోవైపు బెదిరింపులకు దిగడం సరైన విధానం కాదని చెప్పారు. ఉద్యోగుల డిమాండ్లన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు శంకర్రావు, ఆచారి శాంతకుమారి, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల ముచ్చటే

రాళ్లుతేలిన మూలజమ్ము రోడ్డు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

సాధారణంగా మూణ్నాళ్ల ముచ్చటే అంటాం. కానీ ఏజెన్సీ రోడ్లు మాత్రం వారం రోజుల ముచ్చటకే పరిమితం అవుతున్నాయి. రోడ్డు నిర్మాణ సమయంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, క్వాలిటీ కంట్రోలింగ్ దృష్టి సారించకపోవడంతో నాణ్యతలేని రోడ్డు నిర్మాణాలు చేపట్టి, మిగిలిన కాసులతో కాంట్రాక్టర్లు జేబులు నింపుకుంటున్నారు. మండలంలోని మూలజమ్ము రోడ్డు నిర్మించిన వారం రోజులకే పై పొర ఊడిపోయింది. రాళ్లు పైకి తేలుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.


నాణ్యతలేని మూలజమ్ము తారు రోడ్డు ఇదే

విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

స్థానిక ఎంఇఒ కార్యాలయ ఆవరణలో బుధవారం జన్‌బాగ్‌దారి నియోజకవర్గ స్థాయి వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలాలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. 'అంబేద్కర్ సామాజిక న్యాయం' అనే అంశం ఆధారంగా వివిధ పోటీలు నిర్వహించారు. వక్తృత్వ పోటీలలో గంటా సజన (జెడ్‌పిహెచ్ఎస్, బలిజిపేట), ఎ.ఝాన్సీ (జెడ్‌పిహెచ్ఎస్, పార్వతీపురం), వ్యాసరచనలో బి.దినేష్ కుమార్ (జెడ్‌పిహెచ్ఎస్, గాదెలవలస), అంపావల్లి పూజిత (బలిజిపేట) చిత్రలేఖనం పోటీల్లో పి.శ్రీచరణ్(గాదెలవలస), సిహెచ్ లిఖిత (బలిజిపేట) ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. విజేతలను ఎంఇఒలు సామల సింహాచలం, వై.విమల కుమారి, కర్రి ప్రసాదరావు, సూరి దేముడు, ఎం.వెంకటరమణ అభినందించారు.

ట్రైసైకిళ్ల పంపిణీ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

కలెక్టరేట్‌లో విభిన్న ప్రతిభావంతులకు ట్రైసైకిళ్లను జాయింట్ కలెక్టరు ఆర్.గోవిందరావు పంపిణీ చేశారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ట్రై సైకిళ్లు మంజూరు చేయవలసినదిగా అర్జీలు పెట్టుకున్న ఇద్దరికి బుధవారం వాటిని జెసి అందజేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ అధికారి పి.వెంకటరమణ మూర్తి పాల్గొన్నారు.

ఆర్నెల్లకోసారి ఆరోగ్య సురక్ష

మొదటి విడతలో 292 శిబిరాలు • జెఎఎస్ జిల్లా ప్రత్యేకాధికారి ఎస్.వెంకటేశ్వర్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్


జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఆర్నెల్లకోసారి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని జెఎఎస్ జిల్లా ప్రత్యేకాధికారి ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. పట్టణంలోని చాకలిబెలగాంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్) వైద్య శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. జెఎఎస్ ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. శిబిరానికి హాజరైన రోగులతో ఆయన మాట్లాడి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా ఆస్పత్రిని సందర్శించారు. గర్భిణులతో మాట్లాడి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మందులను కేంద్ర డ్రగ్ స్టోర్ నుంచి గ్రామ, వార్డు సచివాలయాలకు పంపించి అక్కడి నుండి బాధితులకు అందజేయనున్నట్లు చెప్పారు. ప్రతి మంగళ, శుక్రవారాలు మండలాల్లో, ప్రతి బుధవారం పట్టణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జగనన్న సురక్ష సురక్ష కార్యక్రమంలో మొదటి దఫాలో జిల్లాలో 292 శిబిరాలు నిర్వహించినట్లు వెల్లడించారు. కంటి వెలుగు కార్యక్రమం ద్వారా నేత్ర తనిఖీలు నిర్వహించి, అవసరమైన వారికి కేటరాక్ట్ శస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు తెలిపారు.

రూ.25 లక్షలకు ఆరోగ్యశ్రీ కవరేజీ

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ కింద రూ.25 లక్షలకు కవరేజీ పెంచినట్లు ఆయన చెప్పారు. ఆరోగ్యశ్రీ యాప్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఆరోగ్యశ్రీ ద్వారా ప్రయివేట్ ల్యాబ్‌లలో సైతం స్కానింగ్ వంటి సేవలు పొందవచ్చని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి విష్ణు చరణ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బి.జగన్నాథరావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వాగ్దేవి, ఆర్‌బిఎస్‌కె ప్రాజెక్టు అధికారి ధవళ భాస్కరరావు, ప్రోగ్రాం అధికారి ఎం.వినోద్, డిఐఒ ఎం.నారాయణరావు, ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జివిఆర్ఎస్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

జిల్లాలో వైద్య శాఖలో పనిచేస్తున్న వివిధ విభాగాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సెకండరీ హెల్త్ డైరెక్టర్ ఎన్.వెంకటేశ్వర్లుకు ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జివిఆర్ఎస్ కిశోర్ ఆధ్వర్యంలో వినతి అందించారు. గిరిజన ప్రాంతంలో పనిచేస్తున్న నర్సింగ్, పారా మెడికల్, మినిస్టీరియల్, ఎన్‌హెచ్ఎంలో పనిచేస్తున్న వారికీ ట్రైబల్ వెయిటేజ్, ట్రైబల్ అలోవెన్స్ ఇవ్వాలని రెగ్యులర్ కోరారు. స్పందించిన డైరెక్టర్ ట్రైబల్ వెయిటేజ్ ఉత్తర్వులు 15 రోజుల్లో ఇస్తానని హామీ ఇచ్చారు. ట్రైబల్ అలవెన్స్ విషయంలో ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎపి వైద్య విధాన పరిషత్తు నాయకులు విపి చంద్ర సాయి, ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.



ఆరోగ్య సురక్ష శిబిరానికి హాజరైన వారితో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్

12 వరకు క్లైయిముల పరిష్కారం

జెసి గోవిందరావు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ముసాయిదా ఓటరు జాబితాపై అందిన క్లెయిములు, అభ్యంతరాలను ఈ నెల 12వ తేదీ వరకు పరిష్కరించనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. బుధవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుది జాబితాను 22న ప్రచురిస్తామని తెలిపారు. 25న జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని కొత్తగా నమోదైన యువ ఓటర్లకు గుర్తింపు కార్డులను అన్ని మండల కేంద్రాల్లో అందజేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 186354 ఫారాలు స్వీకరించగా, వాటిలో 179811 ఫారాలు పరిష్కరించి ఓటరు జాబితాలో చేర్చినట్లు తెలిపారు. ఫారం-6 దరఖాస్తులు 43,061 స్వీకరించగా 1093 తిరస్కరణ, 41968 నమోదు అయినట్లు వివరించారు. ఫారం-7 దరఖాస్తులు 46,067కు 2636 తిరస్కరించినట్లు చెప్పారు. ఎలక్ట్రానిక్ ఓటింగు మిషన్లపై ప్రజలకు అవగాహన కల్పించుటకు జిల్లాలో శాశ్వత సెంటర్లు, మొబైల్ ప్రదర్శన వ్యాన్లు ఏర్పాటు చేశామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ప్రజలను ప్రోత్సహించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, బిఎస్‌పి ప్రతినిధి తామరకండి వెంకటరమణ, వైసిపి ప్రతినిధులు వి.శ్రీనివాసరావు, ఎస్.ఉమామహేశ్వరరావు, ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రతినిధి పి.రవికుమార్, జనసేన పార్టీ ప్రతినిధి పైల శ్రీనివాసు, ఎన్నికల సూపరింటెండెంట్ డి.రవికుమార్, తదితరులు, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెసి గోవిందరావు


డివైడర్‌కు ఢీకొనడంతో అడ్డంగా నిలిచిపోయిన భారీ వాహనం

వీరఘట్టంలో ట్రాఫిక్ జామ్

ప్రజాశక్తి-వీరఘట్టం

మండల కేంద్రంలో తెలగ వీధి జంక్షన్ వద్ద పాలకొండ నుంచి పార్వతీపురం వైపు వెళ్తున్న భారీ వాహనం బుధవారం డివైడర్‌ను ఢీకొంది. దీంతో వాహనం ముందు భాగం దెబ్బతినడంతో మార్గం మధ్యలో నిలిచిపోయింది. రోడ్డుకు అటు, ఇటు వాహనాలు వెళ్లేందుకు వీల్లేకపోవడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

లేగదూడల ప్రదర్శన

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని జోగంపేట పంచాయతీలో బుధవారం లేగదూడల ప్రదర్శన నిర్వహించారు ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ కార్యనిర్వాహక అధికారి ఎల్.దామోదర మాట్లాడుతూ పశువుల సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. లేగదూడల్లో విజేతలను ఎంపిక చేసి, రైతులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ వి.నారాయణ, సర్పంచ్ కె.సింహాచలం, పశుసంవర్ధక శాఖ ఎడి సిహెచ్ దీనకుమార్, మండల పశువైద్యాధికారి ఎస్.రామారావు పాల్గొన్నారు.

స్థానికులకే టికెట్ ఇవ్వాలి

ప్రజాశక్తి-సీతంపేట

పాలకొండ నియోజకవర్గంలో సీతంపేట స్థానికులకే టిడిపి తరపున ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు బిడ్డిక దమైంది నాయుడు ఒక ప్రకటనలో కోరారు. సీతంపేట స్థానికులకు టికెట్ ఇస్తే అందరికీ బంధువర్గంతో పాటు ఎక్కువ ఓట్లు ఉన్నాయని, గెలవడానికి వీలుగా ఉంటుందని చెప్పారు. ఇక్కడ టికెట్ ఇచ్చినవారు గతంలో గెలిచారని గుర్తుచేశారు.

సమాన వేతనం చెల్లించాలి

ప్రజాశక్తి-సీతంపేట

సమాన పనికి సమాన వేతనం ఇచ్చేంత వరకు పోరాటం సాగుతుందని సవరభాష ఉపాధ్యాయుల సంఘం తీర్మానించింది సీతంపేటలోని సిఐటియు కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షులు సవర ఆనందరావు అధ్యక్షతనలో సమావేశం నిర్వహించారు. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డుంబు, ఎస్.ఎల్లంగ్, ఎస్.మాసయ్య, బి.సుహాసిని. ఎం.భారతి పాల్గొన్నారు.

వృద్ధురాలి విరాళం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

తోటపల్లి దేవస్థానానికి జియ్యమ్మవలస మండలం భట్లభద్ర గ్రామానికి చెందిన వృద్ధురాలు ఒలేటి లక్ష్మి రూ.లక్ష విరాళం అందజేశారు. బుధవారం ఆలయ ట్రస్టు సభ్యులకు విరాళాన్ని అందించారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ మద్రాపు సత్యనారాయణ, మేనేజింగ్ ట్రస్టీ డి.ధనుంజయరావు, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డి.పారినాయుడు, కన్వీనర్ శ్రీరామ చంద్ర మూర్తి, ట్రెజరర్ దుర్గారావు పాల్గొన్నారు.

ఒకేషనల్ విద్య పై అవగాహన

గంట్యాడ: మండలంలోని మదనాపురం ఆదర్శ పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు బుధవారం ఒకేషనల్ విద్యపై అవగాహన కల్పించారు. ఎస్ఎస్ఎ ఆధ్వర్యంలో ఐటిఆర్‌సి కంపెనీ సమక్షంలో విజ్ఞాన పర్యటన నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులను తాటిపూడి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారితో జరిగిన సంభాషణలతో ఐటిఐటిఈఎస్ ఏ విధంగా ఉపయోగపడుతుందో విద్యార్థులకు బ్యాంకు మేనేజర్ నగేష్, భవాని శంకర్ వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్ రామకృష్ణ, సైన్స్ టీచర్ శంకర్, ఒకేషనల్ ట్రైనర్ బి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కమాండెంట్‌ను కలిసిన ఎమ్మెల్యే

డెంకాడ: చింతలవలస 5వ ఏపియస్‌పి బెటాలియన్ కమాండెంట్ రాహుల్ దేవ్ శర్మను నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు బుధవారం బెటాలియన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు ఉన్నారు.

ప్రజలు తలచుకుంటే మార్పు సాధ్యం

శృంగవరపుకోట: ప్రజలు తలచుకుంటే రాజకీయ వ్యవస్థలో మార్పు సాధ్యమేనని, ఢిల్లీ, పంజాబ్ తరహాలో అవినీతి లేని అభివృద్ధి కోసం ఆమ్‌ఆద్మీ పార్టీలో చేరేందుకు ప్రజలంతా ముందుకు రావాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.దయానంద్ కోరారు. బుధవారం ఎస్.కోటకు చెందిన విశ్రాంత ఉద్యోగి కృష్ణారావుతో పాటు కొంతమంది నియోజకవర్గం ఇంచార్జి పునపాటి ప్రతాప్ వర్మ ఆధ్వర్యంలో ఆప్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బూరాడ శ్రీనివాస్, విజయనగరం నియోజకవర్గ కన్వీనర్ తిప్పాన కోటేశ్వరరావు, జగన్, శ్యాం, రవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం

రేగిడి: బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఏపిజివిబి రీజనల్ మేనేజర్ బి రాఘవేంద్ర అన్నారు. బుధవారం బ్యాంకు మేనేజర్ పొన్నాన ఈశ్వరరావు ఆధ్వర్యంలో నూతన ఏపిజివిబి భవనాన్ని ఉంగరాడ రోడ్డులో ప్రారంభించారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులకు తక్కువ వడ్డీతో రుణాలు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం రీజియన్ బిజినెస్ మేనేజర్ సోమేశ్వరరావు, ఉంగరాడ సర్పంచ్ శోభారాణి, అకౌంటెంట్ ఈశ్వరరావు, కింజరాపు మధుసూదన రావు నాయుడు, ఖాతాదారులు, బ్యాంకు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

ప్రజాశక్తి-పూసపాటిరేగ

మండలంలోని చోడమ్మ అగ్రహారం పరిధిలోగల జి. వోడవరంలో సిపి ఆక్వా పరిశ్రమ వారిలు, రస్తాలు కలిపి సుమారుగా 6 ఎకరాల భూమి ఆక్రమణలో ఉందని చోడమ్మ అగ్రహారం మాజీ సర్పంచి నల్ల అప్పలరాజు బుధవారం తహశీల్దార్‌కి ఫిర్యాదు చేశారు. ఆ భూమిని సర్వే చేయించి స్వాధీనం చేసుకోవాలని కోరారు.

శాంతియుత ధర్నాకు అనుమతి ఇవ్వండి

శాంతియుతంగా సిపి పరిశ్రమ దగ్గర ధర్నా చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని కార్మిక నాయకుడు నల్ల అప్పలరాజు తహశీల్దార్ భాస్కరరావుకు వినతి అందించారు. సిపి ఆక్వా పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న వారిని అకారణంగా తొలగించిన విషయం తెలిసిందే అన్నారు. ఈ విషయమై పరిశ్రమ ముందు పోరాటం చేసిన విషయం కూడా తమకు తెలుసునని అయితే కార్మికులకు జరిగే అన్యాయంపై న్యాయం చేయాలని కోరేందుకు ధర్నా చేపడతామన్నారు. న్యాయం జరిగేంత వరకూ పరిశ్రమ దరిలో ధర్నాకు అనుమతి కోరారు. ఆయనతో పాటు కార్మికులు ఉన్నారు.

నరసింహ కొండకు పాదయాత్ర

ప్రజాశక్తి-కొత్తవలస

ధనుర్మాసం పురస్కరించుకుని మంగళపాలెంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 3వేల మంది భక్తులతో సింహాచలం వరాహ లక్ష్మి నరసింహ స్వామి కొండకు బుధవారం పాదయాత్రగా తరలి వెళ్లారు. ట్రస్టు ప్రాంగణంలో చైర్మన్ రాపర్తి జగదీష్ కుమార్ తల్లి సుబ్బలక్ష్మమ్మ పూజలు నిర్వహించి పాదయాత్రను ప్రారంభించారు. ఒడిస్సా, అరకు, దుద్దిగూడ, ఎస్.కోట, బొడ్డవర, చీకటిగెడ్డ, బొర్రా తదితర ప్రాంతాలనుంచి హాజరైన గిరిజనులు గ్రామంలోని రామాలయంలో భజన, ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పాదయాత్రగా భక్తులు సింహాచలం కొండకు చేరుకొని స్వామిని దర్శించారు. భక్తులకు చైర్మన్ రాపర్తి జగదీష్ కుమార్ ప్రసాదం, జ్ఞాపికలను అందజేశారు. పాదయాత్రలో పాల్గొన్న భక్తులకు వసతి, భోజన సౌకర్యాలను ట్రస్టు నిర్వాహకులు కల్పించారు.

జగనన్నా నీకో దండం

- అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన హామీ గుర్తుందా?
- వినూత్న రీతుల్లో అంగన్వాడీల నిరసనలు
- 30వ రోజుకు నిరవధిక సమ్మె


సాలూరు.. సిఎం జగన్ చిత్రపటం వద్ద సాష్టాంగా నమస్కారాలు చేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి -సాలూరు

ఎన్నికల ముందు సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన ఏమైందని అంగన్వాడీలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. నెల రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడంపై భగ్గుమంటున్నారు. అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన హామీ ఏమైందని నిలదీస్తున్నారు. ప్రభుత్వ మొండి వైఖరికి వ్యతిరేకంగా వినూత్న రీతుల్లో నిరసనలు తెలియజేస్తున్నారు. జిల్లాలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన చేపట్టిన బుధవారం 30వ రోజుకు చేరింది. అంగన్వాడీలకు సిపిఎం, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

సాలూరు పట్టణంలో సమ్మె శిబిరం వద్ద సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటం ఎదుట అంగన్వాడీలు సాష్టాంగ నమస్కారాలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎ.నారాయణమ్మ, శశికళ, తిరుపతమ్మ, పార్వతి, సుభద్ర, అరుణ పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా 30వ రోజు పార్వతీపురం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరాహార దీక్ష బుధవారం విజయవంతంగా కొనసాగింది. వీరికి సిపిఎం జిల్లా కమిటీ నాయకులు ఎం.తిరుపతిరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, ఉపాధ్యక్షులు వి.ఇందిర, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, పట్టణ నాయకులు బొత్స లక్ష్మి, అంగన్వాడి యూనియన్ జిల్లా కార్యదర్శి గంటా జ్యోతి పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురంలో అంగన్వాడీలు మోకాళ్లపై కూర్చుని దండాలు పెడుతూ నిరసన తెలిపారు. అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు సత్యవతి, కస్తూరి పాల్గొన్నారు.

బలిజిపేట : అంగన్వాడీల సమ్మెకు ఎపిటిఎఫ్ మండల కార్యదర్శి గుల్ల రామారావు సంఘీభావం తెలిపారు.

గరుగుబిల్లి : మండలం కేంద్రంలో సమ్మె శిబిరం వద్ద ప్రభుత్వాన్ని నమ్మి మోసపోయినందుకు తమ చెప్పుతో తాము కొట్టుకొని అంగన్వాడీలు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ పాల్గొన్నారు.

కురుపాం : మండల కేంద్రంలో ప్రధాన రహదారి వద్ద సమ్మె 30 రోజులకు చేరిన నేపథ్యంలో 30 ఆకారంలో అంగన్వాడీలు కూర్చుని నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు పి.సరళ కుమారి, ప్రాజెక్టు కార్యదర్శి జె.సరోజ పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక తహశీల్దార్ కార్యాలలయం ఎదుట సమ్మె శిబిరం వద్ద 30 అంకె ఆకారంలో కూర్చుని అంగన్వాడీలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మడక సత్యవతి, ఎం.యశోద, ఎస్.అరుణ, పి.పద్మ, ఆర్.లక్ష్మి, సిఐటియు నాయకులు జి. వెంకటరమణ, రామారావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

సీతంపేట : సీతంపేట ఐటిడిఎ ఎదుట సమ్మె శిబిరాన్ని అంగన్వాడీలు కొనసాగించారు. వీరికి టిడిపి నాయకులు దమయంతి నాయుడు, ఎస్‌టి సెల్ రాష్ట్ర కన్వీనర్ చంద్రరావు, మాజీ ఎంపిపి మల్లయ్య, సూర్యారావు, జెఎసి కన్వీనర్ జనార్దనరావు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎం.కాంతారావు, సీనియర్ కార్యకర్తలు ఎ.శాంతికుమారి, తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : కొమరాడలో అంగన్వాడీలు వివిధ రకాల ప్రార్థనలు చేస్తూ నిరసన తెలిపారు. అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి సిరికి అనురాధ, సెక్టార్ లీడర్లు బి.అలివేలు, జ్యోతి, పద్మ, లలిత, భారతి, జయమ్మ, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పాల్గొన్నారు.

భామిని : భామిని మండల కేంద్రంలో అంగన్వాడీలు 30 సంఖ్యలో కూర్చొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి హైమప్రభ, సిఐటియు నాయకులు కె.మిన్నారావు, ప్రసాద్, ధర్మారావు పాల్గొన్నారు.


గరుగుబిల్లి.. చెప్పుతో కొట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు


గుమ్మలక్ష్మీపురం... మోకాళ్లపై నిలబడి దండం పెడుతున్న అంగన్వాడీలు


పార్వతీపురంటౌన్.. అంగన్వాడీలనుద్దేశించి మాట్లాడుతున్న వై.మన్మథరావు

క్రీడా స్ఫూర్తిని చాటాలి

- జాయింట్ కలెక్టర్ గోవిందరావు
- 'ఆడుదాం ఆంధ్ర' మండల స్థాయి పోటీలు ప్రారంభం


కురుపాం.. పోటీలను ప్రారంభిస్తున్న ఎంపిపి శెట్టి పద్మావతి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఆటల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు సూచించారు. మండలంలోని వెంకంపేట గ్రామంలో బుధవారం ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ పోటీల్లో విజేతలను నియోజకవర్గ స్థాయికి పంపిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఆకిబ్ జావేద్, వ్యాయామ శిక్షకులు కె.తిరుపతిరావు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురంలో ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రీడా పోటీలను జెడ్‌పిటిసి మండంగి రాధిక ప్రారంభించారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట సర్పంచి ఆర్.చైతన్య స్రవంతి, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ జి.గిరిబాబు, ఎంపిడిఒ సాల్మన్‌రాజు, ఎల్విన్‌పేట ఎస్ఐ శివప్రసాద్, ఎంఇఒ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కురుపాం : కురుపాంలో సాయిరాం ఆలయ మైదానంలో మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపిపి శెట్టి పద్మావతి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి జి.సుజాత, ఎంపిడిఒ ఎస్.అప్పారావు, సర్పంచ్ జి.సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, ఇఒ కె.చంద్రశేఖర్, వైసిపి గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, ఎంపిటిసిలు వి.బంగారునాయుడు , స్వామియోజులు , సంతోషి, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కె.సురేష్ కుమార్ పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలో ఎన్‌టిఆర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో మండల స్థాయి ఆడదాం ఆంధ్ర పోటీలు నిర్వహించారు. పోటీలను ఎంపిపి బి.ఆదినారాయణ, ఎంపిడిఒ కె.గీతాంజలి పర్యవేక్షించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఇన్చార్జి జాకబ్ దయానంద్, పిడి లక్షణమూర్తి, కార్యదర్శులు పాపారావు, వినోద్, శ్యామ్‌బాబు పాల్గొన్నారు.


పార్వతీపురంరూరల్.. క్రికెట్ ఆడుతున్న జెసి గోవిందరావు


వీరఘట్టం.. క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపిడిఒ శ్వేత


సీతంపేట.. వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

వీరఘట్టం : స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల (బాలురు)లో మండల స్థాయి పోటీలను ప్రారంభించారు. ఎంపిడిఒ డి.శ్వేత క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఇఒ వి.రామచంద్రరావు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.ఉమామహేశ్వరరావు, ఎం.రామకృష్ణ, ఎస్.పద్మరాజు, కె.సాల్మన్‌రాజు, తూముల మధు పాల్గొన్నారు.

పాచిపెంట : పి.కోనవలస క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను ఎంపిపి బి.ప్రమీల ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.లక్ష్మి కాంత్, తహశీల్దార్ ఎం.రాజశేఖర్, గొట్టాపు ముత్యాల నాయుడు, పి.వీరమనాయుడు పాల్గొన్నారు.


పాచిపెంట.. క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపిపి ప్రమీల

పింఛనుదారుల సమస్యలకు తక్షణ పరిష్కారం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

పింఛనుదారులకు ఎటువంటి సమస్యలున్నా తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కురుపాం సబ్ ట్రెజరీ అధికారి శంకర్రావు స్పష్టంచేశారు. బుధవారం వర్తక సంఘం భవనంలో గుమ్మలక్ష్మీపురం పింఛనుదారుల సంఘం అధ్యక్షులు గుడ్ల హరిప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పింఛనుదారుల కోరిక మేరకు మండలానికే వచ్చి లైఫ్ సర్టిఫికెట్ చేస్తున్నట్లు తెలిపారు. సంక్రాంతి తర్వాత మరోసారి గుమ్మలక్ష్మీపురం సందర్శించి వృద్ధులకు, పేషెంట్లకు వారి ఇంటి వద్దకు వచ్చి లైఫ్ సర్టిఫికేషన్ చేస్తామన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం గౌరవ అధ్యక్షులు బగ్గం బాబ్జి ప్రసాద్, విశ్రాంత ఉపాధ్యాయులు తిరుపతిరావు, నాగేశ్వరరావు, చలపతి, మురళి, కృష్ణమూర్తి నాయుడు, రిటైర్డ్ ఉద్యోగులు చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-సాలూరు

సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణ ప్రజలు పోలీసు శాఖ సూచించిన జాగ్రత్తలు పాటించాలని టౌన్ సిఐ జి.డి.బాబు కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పండుగ సందర్భంగా కోడి పందేలు, పేకాట శిబిరాలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని చెప్పారు. అలాంటి ఘటనల్లో ఎవరైనా దొరికితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు, కారు యజమానులు విధిగా వాహనాలకు సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ దగ్గర పెట్టుకోవాలని సూచించారు. రాత్రివేళల్లో మద్యం సేవించి వాహనాలు నడిపితే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాత్రి వేళల్లో అనవసరంగా రోడ్లపై తిరగరాదని కోరారు. సూచనలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


నృత్యంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ప్రిన్సిపల్ శ్యామ్‌బాబు

విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-సీతంపేట

ఇటీవల శ్రీకాకుళం జిల్లాలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో నిర్వహించిన జోన్-1 స్థాయి ఇంటర్ స్టేట్ యూనివర్సిటీ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు థింసా నృత్యం ప్రదర్శించి ప్రథమ స్థానం సాధించారు. ఆంధ్ర యూనివర్సిటీలో ఈనెల 5 నుంచి 9 వరకు జరిగే 37వ సౌత్ జోన్ యువభేరిలో జానపద నృత్యం ప్రదర్శించి, ఐదో బహుమతి సాధించారు. దీనికి సమన్వయకర్తగా ఫణి కుమారి వ్యవహరించారు. దీంతో విద్యార్థులను, సమన్వయకర్తను డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్యామ్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ ప్రభాకర్, అధ్యాపకులు అభినందించారు.

సంతకు సంక్రాంతి కళ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురంలో బుధవారం నిర్వహించిన వారపు సంతకు ప్రజలు వేల సంఖ్యలో తరలివచ్చారు. గుమ్మలక్ష్మీపురం నుంచి ఎల్విన్‌పేట వరకు ట్రాఫిక్ జామ్ అయింది. సంక్రాంతి పండగ నేపథ్యంలో కొత్త బట్టలు, నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసేందుకు ప్రజలు చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా వచ్చారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వారపు సంత జరిగింది. ఒక్కొక్క షాపు వద్ద వేలాది రూపాయలు అమ్మకాలు జరిగాయి.


సంతలో షాపుల వద్ద జనాల రద్దీ

మంచిమనసు చాటుకున్న వాలంటీర్

ప్రజాశక్తి -గరుగుబిల్లి

అనారోగ్యం కారణంగా విజయనగరంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి వాలంటీరు పింఛను అందజేసి మంచిమనసు చాటుకున్నారు. మండలంలోని గిజబ గ్రామానికి చెందిన మరడాన రామినాయుడు అనారోగ్యం కారణంగా విజయనగరంలోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో వాలంటీర్ సామల మేరీ బుధవారం విజయనగరంలోని ఆస్పత్రికి వెళ్లి, రామినాయుడుకు పింఛను అందజేశారు. దీంతో సర్పంచ్ మండల భాగ్యలక్ష్మి, వైసిపి నాయకులు మండల శంకరరావు.. వాలంటీర్‌ను అభినందించారు.


విజయనగరంలో ఆస్పత్రిలో పింఛను అందిస్తున్న వాలంటీర్ మేరీ

కొత్త పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

వైఎస్ఆర్ పింఛను కానుక ద్వారా మంజూరైన కొత్త పింఛన్లను గుమ్మలక్ష్మీపురం సచివాలయంలో సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సచివాలయ పరిధిలో కొత్తగా 13 పింఛన్లు మంజూరయ్యాయి. కార్యక్రమంలో వైస్ సర్పంచి కిశోర్, మాజీ సర్పంచి ప్రేమానంద్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వహీద్ ఖాన్, గ్రామ సేవాదళ్ బిఎల్, విఆర్ఒ హరికృష్ణ పాల్గొన్నారు.

భామిని : మండలంలోని లివిరి పంచాయతీలో పెంచిన రూ.3 వేల పింఛన్లను లబ్ధిదారులకు పిఎసిఎస్ అధ్యక్షులు గెల్లంకి రమేష్ పంపిణీ చేశారు. పింఛను పెంపుతో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు సమాజంలో గౌరవంగా బతకవచ్చని రమేష్ తెలిపారు.

'తిరుమల సాయి'లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలం పెదమేరంగి కూడలిలో ఉన్న తిరుమల సాయి హైస్కూల్‌లో బుధవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా డూడూ బసవన్నలు, ఎడ్లబండి మీద ముత్తయిదువులు, హరిదాసు కీర్తనలు, కోలాటం, నాటకాలు విద్యార్థుల వేషధారణ ఆకట్టుకున్నాయి. తెలుగు సంప్రదాయం ఉట్టి పడేలా సంక్రాంతి ప్రశత్యం గూర్చి విద్యార్థులకు తెలియజేశారు.


హరిదాసు వేషధారణలో విద్యార్థి